సాక్షి
రంగారెడ్డి
శనివారం । 24 । ఆగస్టు । 2024



రుణమాఫీపై ఓర్వలేకే..

రుణమాఫీని బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. 10లో▸



కంపెనీలో తయారయ్యే మదర్‌బోర్డులు పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి

న్యూస్‌రీల్

నేడు ఫ్రీడం కప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మినీస్టేడియం ఆవరణలో శనివారం ఫ్రీడం కప్ క్రికెట్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, రెసిడెన్షియల్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పోటీలకు అర్హులని తెలిపారు. ఈ ఎంపికకు ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఎంపికలకు వచ్చే విద్యార్థులు పాఠశాల హెచ్ఎం సంతకంతో కూడిన బోనఫైడ్ సర్టిఫికెట్‌ను విధిగా తీసుకురావాలని సూచించారు.

డాక్టర్ సుశాంత్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



సాక్షి సిటీబ్యూరో: ఇక్ఫాయి ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐఎఫ్‌హెచ్ఈ) డీమ్డ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (ఐఎస్ఓఎస్ఎస్) ఫ్యాకల్టీ డాక్టర్ సుశాంత్‌కుమార్ మహాపాత్రకు 'ఎన్జే యశస్వి బెస్ట్ టీచర్' అవార్డు లభించింది. ఇక్ఫాయ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం సందర్భంగా సుశాంత్‌కుమార్‌కు అవార్డుతో పాటు సర్టిఫికెట్, లక్ష రూపాయల నగదు పురస్కారం అందించారు. ఏఐసీటీఈ చైర్మన్ డాక్టర్ టీజీ సీతారామ్, వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎల్ఎస్ గణేష్, ఐఎఫ్‌హెచ్ఈ చాన్స్‌లర్ డాక్టర్ సి రంగరాజన్ సమక్షంలో సుశాంత్‌కుమార్ అవార్డు అందుకున్నారు. ఉన్నత విద్యాసంస్థలలో అత్యుత్తమ విద్యాబోధన, పరిశోధన, పరిశ్రమలతో విద్యాసంస్థ సత్సంబంధాలు పెంపొందించే వారికి ఈ అవార్డును అందిస్తారు. కాగా ఆయన పలు ఉన్నత పదవులలో కొనసాగారు. ఈ సందర్భంగా ఆయనను ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

పీఎంఆర్‌బీపీకి దరఖాస్తుల ఆహ్వానం

తుక్కుగూడ: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (పీఎంఆర్‌బీపీ) చిల్డ్రన్ అవార్డులను ప్రభుత్వం అందజేయనుంది. క్రీడలు, నూతన ఆవిష్కరణ, సామాజిక సేవ, పర్యావరణం, సామాజిక కళలు, సైన్స్ అండ్ టెక్నాలజీలో రాణించిన చిన్నారుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.పద్మజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మొయినాబాద్: గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. మొయినాబాద్‌లోని సురబి వెంచర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ శుక్రవారం జేసీబీలతో కూల్చివేయించారు. పంచాయతీ అధికారులు చేపట్టిన కూల్చివేతలను స్థానికులు అడ్డుకున్నారు. బడాబాబుల నిర్మాణాలను వదిలేసి స్థానికులు నిర్మించుకునే ఇళ్లను కూల్చివేయడంపై మండిపడ్డారు.

ప్రేమ వ్యవహారంతోనే బీటెక్ విద్యార్థి హత్య

పోలీసుల అదుపులో నిందితులు

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న బీటెక్ విద్యార్థి హత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ (21)ను స్నేహితుడే దారుణంగా హత్య చేసిన విషయం విధితమే. మృతుడు ప్రశాంత్‌తో పాటు నిందితులు రెండో తరగతి నుంచే స్నేహితులుగా ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ప్రశాంత్ హత్యకు ప్రధాన కారణం ప్రేమ వ్యవహారమేనని నిర్ధారణ అయ్యింది. దీంతో పాటు పాత గొడవలు కూడా ఉన్నట్లు తేలింది. హత్య కు పాల్పడిన ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. బర్త్‌డే వేడుకల్లో కేక్ కటింగ్‌కు వినియోగించే ప్లాస్టిక్ చాక్‌తో పొడిచినట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. సిగరేట్ తాగుతూ జరిగిన గొడవలో క్షణికావేశంలోనే ఈ హత్యోదంతం చోటు చేసుకున్నట్లు తెలిసింది.

నత్తనడకన..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

- ఇప్పటి వరకు 3,458కు అనుమతి
- 1,96,154 అధికారుల వద్దే పెండింగ్
- మూడు నెలల్లో పరిశీలన సాధ్యమేనా..?



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికారిక లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతకు తోడు తర చూ సర్వర్ మొరాయిస్తుండటమే ఇందుకు కారణం. కలెక్టర్ శశాంక ఇప్పటికే రెండు సార్లు ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అయినా ఆశించిన స్థాయిలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో ఇప్పటికే ఖాళీ స్థలం క్రమబద్ధీకరణకు దరఖాస్తు ఫీజు చెల్లించిన లబ్ధిదారులంతా మున్సిపాలిటీలు, మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారుల నుంచి కనీస సమాచారం రాకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

రాజకీయ ఒత్తిళ్లు..

ఖాళీ ప్లాట్లు/ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుకు రూ.పది వేలు, ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వెయ్యి ఫీజుగా నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్లలో 3,58,464 దరఖాస్తులు రాగా, జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్ల పరిధి నుంచి అత్యధికంగా 2,38,263 దరఖాస్తులు అందాయి. మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం వాటి పరిశీలన కోసం రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఆయా బృందాలు ఇప్పటి వరకు 3,458 దరఖాస్తులను అంగీకరించగా, మరో 1,218 తిరస్కరించాయి. మిగిలిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. అంతేకాదు వచ్చిన దరఖాస్తుల్లో 35,837 నిషేధిత జాబితాలో ఉన్నాయి. వీటి ఆమోదం కోసం రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి.

మండల కేంద్రాల్లో దరఖాస్తులు, పరిశీలన బృందాలు

మండలం	దరఖాస్తులు	పరిశీలన బృందాలు
ఫరూఖ్‌నగర్	22,051	03
కేశంపేట	10,200	03
తలకొండపల్లి	2,323	02
యాచారం	4,464	02
కడ్తాల్	3,513	02
కొందుర్గు	1,505	02
ఆమనగల్లు	929	01
మాడ్గుల	708	01
జిల్లేడు చౌదరిగూడెం	683	01
మంచాల	54	01

మున్సిపాలిటీలు/కార్పొరేషన్లలో దరఖాస్తులు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	నిషేధిత జాబితాలో	బృందాలు
ఆదిబట్ల	14,892	1,344	03
ఆమనగల్లు	3,561	190	02
ఇబ్రహీంపట్నం	15,345	341	03
జల్‌పల్లి	10,892	2,657	03
కొత్తూరు	3,956	172	02
మణికొండ	2,591	107	02
నార్సింగి	3,354	722	02
పెద్ద అంబర్‌పేట్	43,459	8,885	04
షాద్‌నగర్	15,466	2,220	03
శంషాబాద్	6,791	936	03
శంకర్‌పల్లి	4,720	781	02
తుక్కుగూడ	2,541	169	02
తుర్కయంజాల్	49,686	4,776	04
బడంగ్‌పేట్	47,790	9,054	04
బండ్లగూడజాగీర్	7,753	2,258	03
మీర్‌పేట్	3,412	1,225	03

వెంటాడుతున్న సాంకేతిక సమస్య

దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన పోర్టల్ సర్వర్ తరచూ మొరాయిస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది పోర్టల్ లాగిన్లై.. అన్ని వివరాలను నమోదు చేసి, తీరా సబ్మిట్ బటన్ నొక్కితే ఫీజు చెల్లింపులు, రసీదులు, ప్రొసీడింగ్స్ జారీ వంటి ప్రక్రియ పూర్తికాక పోగా, మళ్లీ మొదటికొస్తుండటంతో ఏం చేయాలో అర్థంకాక ఆయా బృందాలు తలపట్టుకుంటున్నాయి. అంతే కాదు ఇప్పటికే అక్రమ నిర్మాణాల గుర్తింపు, కూల్చివేతలు, కొత్త భవనాలకు అనుమతుల జారీ, ఇంటి పన్ను నిర్ధారణ, వసూళ్ల వంటి ప్రక్రియతో బిజీగా ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులకు.. వేలల్లో పేరుకుపోయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన సవాల్‌గా మారింది.

ఐటీ అడ్డాగా హైదరాబాద్

- పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కొంగరకలాన్‌లో కేన్స్ టెక్నాలజీ యూనిట్ ప్రారంభం

ఇబ్రహీంపట్నంరూరల్: పెట్టుబడిదారులను ఆకర్షించేలా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కొంగరకలాన్‌లో రూ.2,800 కోట్లతో నిర్మించిన కేన్స్ టెక్నాలజీ అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ ఐటీ సంస్థలకు నిలయంగా.. సాంకేతిక రంగాల్లో దిగ్గజంగా మారిందన్నారు. కేన్స్ సంస్థ తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేలా రూ.2,800 కోట్ల పెట్టుబడులతో 2 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా నిర్మించడం శుభపరిణామమన్నారు. తమ ప్రభు త్వం పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తూ పెట్టుబడులకు స్వర్గధామంగా నిలుస్తోందని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే 65 చోట్ల ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు ఆనంద్ మహీంద్ర, టాటా సన్స్ సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇంటర్ పూర్తి చేసిన నిరుద్యోగులు పరిశ్రమల్లో పనిచేసేందుకు వీలుగా అధునాతన పరిజ్ఞానం అందిస్తామని తెలిపారు. దీనిద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో హైదరాబాద్‌కు వచ్చిన పెట్టుబడిదారులు ఇక్కడ సరైన వసతులు లేవని సాకులు చూపేవారన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. నగరం చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్డు, పక్కనే ఎయిర్‌పోర్టు, రవాణా సౌకర్యం కోసం జాతీయ రహదారులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు, విద్యుత్, నీరు, రోడ్లు, శాంతిభద్రత విషయంలో ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు.

ఔటర్ చుట్టూ త్రిపుల్‌ఆర్, మెట్రో విస్తరణ

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఔటర్‌రింగ్ రోడ్డుకు 30- 40 కిలోమీటర్ల పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. త్రిపుల్ ఆర్ వెంట మెట్రో రైల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చడం కోసం మెట్రో సేవలను విస్తృతంగా అందిస్తున్నామని తెలిపారు.

పరిశ్రమల రాకతో అభివృద్ధి

పరిశ్రమల రాకతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఏర్పాటు కోసం గతంలో పోరాటాలు చేశామని గుర్తు చేశారు. 20 వేల ఎకరాల్లో ఫార్మా ఏర్పాటును వ్యతిరేకించి, ఈ స్థానంలో ఫోర్త్ సిటీ నిర్మాణానికి పునాదిరాయి వేశామన్నారు. మెట్రో వస్తే ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కేన్స్ టెక్నాలజీ చైర్మన్ సవితరమేశ్, ఎండీ రమేశ్‌కణ్ణన్, సీఈఓ రాజేశ్‌శర్మ, డైరెక్టర్ జైరామ్, వీరప్పన్, తహసీల్దార్ సునీత, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్ కోర్టు సముదాయాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తులు, ఆర్అండ్ బీ అధికారులు

కోర్టు సముదాయం పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్: హయత్‌నగర్‌లోని 7వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు సముదాయాన్ని శుక్రవారం రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ అధికారులు పరిశీలించారు. నూతన కోర్టు భవనంతో పాటు తాత్కాలిక కోర్టుల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, అంచనా వ్యయాలను అధ్యయనం చేయాల్సిందిగా రాష్ట్ర హైకోర్టు బిల్డింగ్ కమిటీ, రంగారెడ్డి జిల్లా కోర్టు జిల్లా న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. దీంతో రోడ్డు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూచన మేరకు ఇంజనీరింగ్ విభాగం అధికారి సురేందర్‌రెడ్డి, హయత్‌నగర్ కోర్టు న్యాయమూర్తులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ సల్మా ఫాతిమా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాంకేత మిత్ర, హయత్‌నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు బిక్షపతి గౌడ్‌తో కలిసి కోర్టు సముదాయాన్ని క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో నూతన కోర్టు భవనం, తాత్కాలిక కోర్టులకు సంబంధించిన వివరాలు, అంచనా వ్యయాలు, మ్యాపులను హైకోర్టుకు అందజేయనున్నట్లు తెలిపారు. శంకుస్థాపన చేసిన తర్వాత మూడు నెలల్లోపు కోర్టు భవనాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్స్ దారా రాములు, శారద, నాజర్, లక్ష్మీకాంతరెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నందుటి సంతోష్ కుమార్ గౌడ్, ట్రెజరర్ తొర్పునూరు ఈశ్వర్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ బండి నరేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు



భోజనం తయారీని పరిశీలిస్తున్న డీఎస్ఓ మనోహర్‌కుమార్ రాథోడ్

- విద్యార్థులకు మంచి భోజనం అందించాలి
- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మనోహర్‌కుమార్ రాథోడ్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మనోహర్‌కుమార్ రాథోడ్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, అంబేడ్కర్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఫరూఖ్‌నగర్‌లోని బీసీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత భోజనాన్ని అందిస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని వండి వడ్డించాలని సూచించారు. ఆహార నాణ్యత విషయంలో రాజీ పడేదిలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు సరఫరా చేసే బియ్యం నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు, ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించినప్పుడే వారిలో మేధోశక్తి పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు వేముల పుల్లయ్య, గంప శ్రీనివాస్, వెంకటేశ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నాగన్‌పల్లిలో 'పోలీసు శిక్షణ'

రాచకొండ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు

- పచ్చజెండా ఊపిన ప్రభుత్వం
- కళాశాల ఏర్పాటుకు భూమిని పరిశీలించిన సీపీ
- మారనున్న 'పట్నం' రూపురేఖలు



నాగన్‌పల్లిలో పోలీస్ కమిషనరేట్ శిక్షణ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: రక్షణ రంగ సంస్థలకు ఇబ్రహీంపట్నం నిలయంగా మారింది. ఇప్పటికే ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ లాంటి సంస్థలు నాగన్‌పల్లి, ఇబ్రహీంపట్నం మధ్యలో కొలువుదీరాయి. వీటికి తోడుగా హైదరాబాద్ సిటీ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ తరహాలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో అత్యాధునిక శిక్షణ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశానికి, రాష్ట్రానికి కావాల్సిన పోలీస్‌వింగ్‌లు సమీపంలో ఉండడంతో రాచకొండ పోలీస్ శిక్షణ కళాశాల ఏర్పాటు సైతం ఇక్కడే చేయాలని భావిస్తోంది.

పోలీస్ శాఖకు ఆదేశాలు

ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాత్రమే పోలీస్ శిక్షణ కళాశాల ఉంది. మూడు కమిషనరేట్‌లు ఏర్పాటైన కారణంగా మూడు ప్రాంతాల్లో ట్రైనింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు పనులను ముమ్మరం చేయాలని, భూ సేకరణ చేపట్టాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును ఆదేశించింది. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి సమీపంలోని సర్వే నంబర్ 291లో గల భూదాన్ భూమిని పరిశీలిస్తున్నారు. ఈ భూమిలో ఇప్పటికే ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థ ప్లాట్లుగా మార్చింది. రెవెన్యూ శాఖ పీఓటీ కింద భూమిని సేకరించి ట్రైనింగ్ కళాశాలకు ఇవ్వాల్సి ఉంటుంది. కళాశాల ఏర్పాటుకు 10 ఎకరాలు అవసరం ఉంది. ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ కేంద్రాలకు సమీపంలో రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండడంతో ఇదే అనువైన ప్రదేశంగా అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. నాగన్‌పల్లి రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇటు పోల్కంపల్లి రోడ్డు, అటు రాయపోల్ రోడ్లకు మధ్యలో ఈ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు.

భూమిని పరిశీలించిన రాచకొండ సీపీ

రాచకొండ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు కోసం శుక్రవారం నాగన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 291లోని భూమిని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు మహేశ్వరం జోన్ డీసీపీ సునితారెడ్డితో కలిసి పరిశీలించారు. కళాశాల ఏర్పాటుకు ఇదే అనువైన ప్రదేశమని సూచించారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజును ఆదేశించారు. రెవెన్యూ అధికారులను భూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. గంజాయి సరఫరా వినియోగాన్ని అరికట్టాలని, వాహనాల పత్రాలను చెకింగ్ చేయాలని సూచించారు. నేరాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ట్రైనింగ్ కళాశాల ఏర్పాటైతే ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలతో పాటు నిఘా పెరుగుతుందన్నారు.

అడ్డదారిలో వెళ్లారు.. అడ్డంగా దొరికారు

- గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు
- పరారీలో మరో నలుగురు
- 60.420 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గంజాయిని అక్రమంగా కారులో తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని యాచారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 60.420 కిలోల గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ రాజు యాచారం సీఐ శంకర్‌నాయక్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఎస్ఓటీ పోలీసుల విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సాయంత్రం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాల్ జిల్లా చెక్‌పోస్టు వద్ద కాపు కాసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సీపట్నం నుంచి అక్రమంగా బెంగళూర్‌కు గంజాయిని తరలిస్తున్న కారును పట్టుకున్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం అలంపట్టు గ్రామానికి చెందిన కొర్ర బాబురావు(30), డుంబ్రిగూడ మండలం, బొడిగూడ గ్రామానికి చెందిన బ్రుండి కామేశ్వర్‌రావు(33)ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి మూడు బ్యాగుల్లో ఉన్న 60.420 కిలోల గంజాయి, బ్రిజా కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుంది. పట్టుబడిన నిందితులను విచారించగా నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన శ్రీనివాస్‌నాయుడు అక్కడ రైతుల భూములను లీజ్‌కు తీసుకొని గంజాను సాగు చేస్తున్నట్లు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లో నివసించే గిరీష్‌కు అందజేసేందుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పట్టుబడిన బాబురావు, కామేశ్వర్‌రావును రిమాండ్‌కు తరలించారు. పరారైన షేక్ మస్తాన్ వలీ, మల్లేశ్వర్‌రావుతోపాటు సూత్రధారులైన శ్రీనివాస్‌నాయుడు, గిరిశ్ కోసం గాలిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

రుణమాఫీపై ఓర్వలేకే విమర్శలు

- అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

మొయినాబాద్ రూరల్: రైతులకు రుణమాఫీని విజయవంతంగా అమలు చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. అందుకే ధర్నాలు, నిరసనలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు దఫాలుగా పాలన సాగించిన వారికి రుణమాఫీ గుర్తుకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే రుణమాఫీ చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ధర్నాలు, నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ పార్టీ నాయకుల మాటలు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడ ఉనికి కోల్పోతామోనన్న భయంతో నిరసనలు, ధర్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. త్వరలో అందరికీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో ఉండి మంత్రిగా పని చేశారని, ఇప్పుడు అదే పార్టీ గురించి మాట్లాడడం సరైంది కాదని హితవు పలికారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, అధికార ప్రతినిధి గౌరీ సతీష్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

శంకర్‌పల్లి: పురుగు మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం శంకర్‌పల్లి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాసానిగూడకు చెందిన రాంచంద్రయ్య(43) రైతు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాంచంద్రయ్య వ్యక్తిగత కారణాలతో ఈ నెల 16న పొలం వద్ద పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రైతు శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ వ్యక్తి మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని జూలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన జంగయ్య(34) గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఆవేశంలో మాటామాట పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన జంగయ్య ఇంట్లోనే చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య పరమేశ్వరి, తండ్రి నాగయ్య, చెల్లెలు సంతోష ఉన్నారు. శుక్రవారం మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మేయర్ పేరిట ట్రేడ్ లైసెన్స్ జారీ

రద్దు చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో 'డ్రగ్‌మార్ట్ ఇన్ కాంగ్రెస్' దుకాణానికి మేయర్ విజయలక్ష్మి గద్వాల్ పేరిట జారీ అయిన ట్రేడ్ లైసెన్స్‌ను జీహెచ్ఎంసీ రద్దు చేసినట్లు కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. తప్పుడు పత్రాలతో ట్రేడ్ లైసెన్సులు జారీ అవుతున్న తీరు శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన విషయం విదితమే. జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలన జరిపి తప్పుడు పత్రాలు అప్‌లోడ్ చేసినా మేయర్ పేరిట ట్రేడ్ లైసెన్స్ జారీ అయినట్లు గుర్తించి బ్లాక్ చేసినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పనితీరు మెరుగుపరచుకోవడానికి ఇది ఉపకరించిందని పేర్కొన్నారు.

కూల్చివేతలు సరికాదు

గ్రామ పంచాయతీ ఎదుట బాధితుల ధర్నా

- పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నెర్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

ఇబ్రహీంపట్నం: తమ ప్లాట్ల రక్షణ కోసం నిర్మించుకున్న ప్రహరీని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని దివ్యసాయి వెంచర్‌లో ప్లాట్ల యజమానులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం వారు నెర్రపల్లి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004లో పంచాయతీ పరిధిలో దివ్యసాయినగర్ పేరుతో చేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి వాటి క్రమబద్ధీకరణ ఫీజులను చెల్లించామన్నారు. తాము కొనుగోలు చేసిన ప్లాట్ల రక్షణకు ప్రహరీ నిర్మించుకుంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి వీణ ప్రహరీ కూల్చివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడుపులు ఇవ్వనందుకే తమ నిర్మాణాలను కూల్చేవేశారని ఆరోపించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వీణతో వాగ్వాదానికి దిగారు. తామంతా మధ్యతరగతి రిటైర్డ్ ఉద్యోగులమని తమకు నష్టం కలిగించిన పంచాయతీ కార్యదర్శి వీణపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, విమల, రాజేందర్, వెంకటేష్, మదన్‌మోహన్, దామోదర్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాల మేరకే..

ఉన్నతాధికారుల ఆదేశానుసారమే నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు నెర్రపల్లి పంచాయతీ కార్యదర్శి వీణ వివరణ ఇచ్చారు. ఆ నిర్మాణాలకు అనుమతులు లేవని.. సీఎస్, డీపీఓలో అందిన ఫిర్యాదుల నేపథ్యంలో వారిచ్చిన ఆదేశానుసారం నిర్మాణాలను తొలగించామన్నారు. బాధితుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

జిల్లా సహకార అధికారిగా సుధాకర్


సుధాకర్‌కు స్వాగతం పలుకుతూ సన్మానిస్తున్న ఉద్యోగులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా సహకార అధికారిగా సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. తన బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తానని ఆయన వెల్లడించారు. సహకార శాఖ అధికారులు సత్యనారాయణ రెడ్డి, మాధవరెడ్డి, విజయ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కను చంపిన వ్యక్తిపై కేసు

మొయినాబాద్: గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కలు ఎంతో మంది చిన్నారులను కరిచి చంపినా.. పీక్కుతిన్నా.. ఇప్పటి వరకూ ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. కానీ తనపై దాడి చేసి కరిచిన కుక్కను చంపిన వ్యక్తిపై కేసు నమోదు కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో గత బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో.. ఇదే గ్రామానికి చెందిన రాజును వీధికుక్క కరిచింది. దీంతో ఇతరులపై కూడా దాడి చేస్తుందని భావించిన రాజు కుక్కను చంపి, తాడుతో లాక్కెళ్లి ఊరి బయట పడేశాడు. ఇదంతా ఓ వ్యక్తి వీడియో తీసి వైరల్ చేశాడు. విషయం తెలుసుకున్న స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి ముదావత్ ప్రీతి గురువారం మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అతివేగం.. తీసింది ప్రాణం

- కారును ఢీకొట్టిన బొలేరో
- ఓడీఎఫ్ ఉద్యోగి మృతి


జంగారెడ్డి(ఫైల్)

శంకర్‌పల్లి: అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓడీఎఫ్(ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ) ఉద్యోగి ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన శంకర్‌పల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని సింగాపురానికి చెందిన సీహెచ్.జంగారెడ్డి(53) ఓడీఎఫ్ ఉద్యోగి. ఆనయకు భార్య కవిత, కుమార్తె(వివాహిత), కుమారుడు ఉన్నారు. గురువారం ఉదయం ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో భార్యతో కలిసి వికారాబాద్ వెళ్లాడు. రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మండల పరిధిలోని కచ్చిరెడ్డిగూడ వద్ద మూలమలుపులో ఎదురుగా వస్తున్న బొలేరో వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జంగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. భార్య చేయి విరిగింది. ఆమెకు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. విదేశాల్లో చదువుకుంటున్న కుమారుడు వచ్చాక శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వేధిస్తున్నాడని కడతేర్చాడు

కుమారుడిని కత్తితో నరికిన కన్నతండ్రి


శివకుమార్ రెడ్డి (ఫైల్)

శంషాబాద్ రూరల్: మద్యం మత్తులో వేధింపులకు గురి చేస్తున్న కుమారుడిని ఓ కన్నతండ్రి కత్తితో నరికి చంపిన ఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన దూలప్పరెడ్డి, సరస్వతి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి రెండో కుమారుడు శివకుమార్‌రెడ్డి (36)తో కలిసి కొన్నేళ్ల నుంచి తొండుపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. శివకుమార్‌రెడ్డి కొంత కాలం డ్రైవర్‌గా పని చేసి ప్రస్తుతం గైడ్‌గా వ్యవహరిస్తున్నాడు. మద్యానికి బానిసగా మారాడు. తన జీతాన్ని జల్సాలకు ఖర్చు చేసి తండ్రి పెన్షన్ డబ్బులు కూడా కావాలని తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం తాగిన శివకుమార్ ఇంట్లో తండ్రితో గొడవ పడ్డాడు. వీరిని తల్లి సరస్వతి సముదాయించి బయటకు వెళ్లింది. కాసేపటికి ఇంట్లో నుంచి కొడుకు అరుపులు విని లోపలికి వెళ్లి చూడగా.. శివకుమార్‌రెడ్డి మంచంపై పడి ఉన్నాడు. అతని మెడ, కాలుపై కత్తిగాట్లు ఉండడంతో పాటు రక్తస్రావంతో ప్రాణాపాయస్థితిలో పడి ఉన్నాడు. భర్త చేతిలో కత్తి ఉంది. కాసేపటికే శివకుమార్ ప్రాణాలు విడిచాడు. కొడుకు వేధింపులు భరించలేక ఇంట్లో చెట్లు నరికే కత్తితో మెడ, కాలుపై కత్తితో పొడిచినట్లు దూలప్ప తన భార్యకు చెప్పాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సరస్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న నెక్లెస్, ఫోన్‌లు అందజేసిన పోలీసులు

శంషాబాద్: ఒకే రోజు ముగ్గురు వేర్వేరు బాధితులకు పోగొట్టుకున్న నెక్లెస్‌తో పాటు రెండు ఫోన్లను ఆర్‌జీఐఏ క్రైమ్ పోలీసులు అందజేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడు బ్యాగును పోగొట్టుకున్నాడు. అందులో డైమండ్ నెక్లెస్ ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పట్టణంలో వేర్వేరు ప్రాంతాల్లో రెండు సెల్‌ఫోన్‌లు కూడా పోయినట్లు ఫిర్యాదులు రావడంతో క్రైమ్ పోలీసులు ఎయిర్‌పోర్టులో సీసీ కెమెరాలను పరిశీలించి రూ.4లక్షల విలువ చేసే డైమండ్ నెక్లెస్‌ను పట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రెండు ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు.

అప్పులు ఇస్తూ.. అధికంగా వసూలు చేస్తూ

సిటీ కోర్టులు: తక్షణ రుణం పేరుతో అప్పులు ఇస్తూ ఆపై వసూళ్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న పలు కంపెనీలపై ఈడీ (డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) చర్యలు చేపట్టింది. దీంతో ఆయా కంపెనీలపై మనీ లాండరింగ్ యాక్ట్ 2002 ప్రకారం పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీని ఆధారంగా ఈడీ (హైదరాబాద్ జోనల్ కార్యాలయం) అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో శుక్రవారం నాంపల్లి స్పెషల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 2020–21 సంవత్సరంలో పలు (ఎన్‌బీఎఫ్‌సీ)నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, ఫిన్‌టెక్ కంపెనీలు, వివిధ మొబైల్ అప్లికేషన్ల ద్వారా తక్షణ రుణం ఇచ్చే వ్యాపార కంపెనీలు, వ్యక్తి గతంగా రుణం ఇస్తూ వ్యాపారం చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో 43 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు ఈడీ వెల్లడించింది. ఈ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగానే దర్యాప్తు చేపట్టామన్నారు. రుణం మొబైల్ యాప్స్ ద్వారా రుణం మంజూరు చేసి తర్వాత అధికా వడ్డీలతో వేధింపులకు పాల్పడుతుండటంతో అప్పు తీసుకున్న వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ రుణాలకు సంబంధించి ఈడీ విచారణలో ఆయా కంపెనీల ఆస్తులను అటాచ్ చేయగా ఫిన్‌టెక్ కంపెనీ, ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలో రూ.346.86 కోట్లు ఉన్నట్లు తేలిందని, మరింత లోతుగా విచారణ చేపడితే దాదాపు రూ. 434 కోట్లు వారి బ్యాంక్ ఖాతాలో నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుతుందన్నారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి త్వరలోనే అన్ని వివరాలు కోర్టు ముందు ఉంచుతామని ఈడీ వివరించింది. త్వరలోనే నాంపల్లి కోర్టు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టే అవకాశం ఉంది.

సోలార్ వినియోగానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

సాక్షి, సిటీబ్యూరో: తక్కువ ఖర్చుతో నాణ్యమైన సోలార్ విద్యుత్ పానల్స్‌ను వినియోగదారులకు అందించేందుకు సాత్విక్ సోలార్, బాసూ ఎనర్జీ సిస్టమ్స్ మధ్య వ్యూహాత్మక ఒప్పందం జరిగింది. బంజారాహిల్స్‌లోని హయత్‌పాలస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఒప్పంద వివరాలను ఇరు సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన సోలార్ ప్యానెల్‌ను విడుదల చేశా రు. ఈ సందర్భంగా తెలంగాణా రెన్యూవబల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (టీఎస్ రెడ్కో) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.జానయ్య మాట్లాడు తూ ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపో తున్న కరెంట్ బిల్లుల బాధ నుంచి ఉపశమనం పొందడానికి సౌర విద్యుత్ ఒక చక్కని పరిష్కారం చూపిస్తుందన్నారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పాదన చేయాలనుకునే వారికి 3 కిలోవాట్ల వరకూ రూ.78 వేలు సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

హైడ్రాలో 3 జోన్లు

- ఒక్కో జోన్‌కు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వం
- ముగ్గురి అధీనంలో మొత్తం 72 బృందాలు
- ఆక్రమణలపైనా ప్రత్యేక ఠాణాతో దర్యాప్తు

దీని పరిధి సెంట్రల్, నార్త్, సౌత్‌లుగా విభజన

సాక్షి, సిటీబ్యూరో: జల వనరులు, ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో సత్వర స్పందన కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సంస్థాగత నిర్మాణంపై డైరెక్టర్ ఏవీ రంగనాథ్ దృష్టి సారించారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న 2053.44 చదరపు కిలోమీటర్ల ప్రాంతం దీని పరిధిలోకి రానుండటంతో అందుకు తగినట్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైడ్రా విభజన, సిబ్బంది కేటాయింపు, యూనిఫాం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేబినెట్ సమావేశం లోపు ఈ అంశాలపై ఓ స్పష్టత తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.



ఒక్కో కమిషనరేట్‌కు ఒక్కో జోన్

వివిధ రకాలైన బాధ్యతలు నిర్వర్తించే హైడ్రా ప్రధానంగా పోలీసు విభాగంతో సమన్వయం ఏర్పాటు చేసుకుని పని చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తమ పరిధిలోని ప్రాంతాన్ని మూడు జోన్లుగా విభజించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. నార్త్ జోన్‌లోకి సైబరాబాద్, సౌత్ జోన్‌లోకి రాచకొండ, సెంట్రల్ జోన్‌లోకి హైదరాబాద్ పోలీసు కమిషనరేట్లు రానున్నాయి. హైడ్రాలో ఒక్కో జోన్‌కు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వం వహించనున్నారు. ప్రతి ఎస్పీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు అసెట్ ప్రొటెక్షన్‌ను పర్యవేక్షిస్తారు. మొదటి అంశంలో ట్రాఫిక్ పోలీసులు, రెండో అంశంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పని చేస్తారు.

మొత్తం 72 బృందాలు ఏర్పాటు...

హైడ్రా పరిధిలోకి జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలు, ప్రత్యేక పరిపాలన బాడీలు, ఇండస్ట్రియల్ ప్రాంతాలు వస్తున్నాయి. వాటికి సంబంధించిన చట్టాల ప్రకారం ఈ అధికారులు పని చేస్తారు. హైడ్రాలో ఏర్పడే మూడు జోన్లలో కలిపి 72 ప్రత్యేక బృందాలు పని చేయనున్నాయి. ఇవన్నీ తమ పరిధిలో విపత్తు స్పందన, ఆక్రమణల నిరోధంతో పాటు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాయి. ప్రాథమికంగా 3,500 వరకు సిబ్బందిని ఈ విభాగానికి కేటాయించనున్నారు. కూల్చివేతలు తదితర సున్నిత సందర్భాల్లో హైడ్రా అధికారులు సాధారణ దుస్తుల్లో ఉండటంతో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రాకు ప్రత్యేక యూనిఫాం కేటాయించాలా? లేక ఆ విభాగంలో పని చేసే పోలీసు సిబ్బందిని వారి యూనిఫాంలో ఉంచాలా అనేది ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవాలని హైడ్రా అధికారులు నిర్ణయించారు.

కబ్జా కథల గుట్టు విప్పే ఠాణా..

ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. హైడ్రా పరిధి మొత్తానికి కలిపి ఆ విభాగం పరిధిలో ఓ ఠాణా ఏర్పాటు కానుంది. ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలో పని చేసే ఈ పోలీసుస్టేషన్‌లో జల వనరులతో పాటు ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు ఉంటుంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహితలను (బీఎన్ఎస్ఎస్) ఆధారంగానే ఈ ఠాణా పని చేయనుంది. పోలీసు, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల ఫిర్యాదుతో పాటు జల వనరులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ఆక్రమణలపై సాధారణ ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సైతం ఈ పోలీసుస్టేషన్‌ను అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. విచారణ, దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు.

టీఎస్‌సీఎస్‌ని సందర్శించిన నోవార్టిస్

సాక్షి సిటీబ్యూరో: రాజేంద్రనగర్‌లో ఉన్న తలసేమియా సికిల్ సెల్ సొసైటీ(టీఎస్‌సీఎస్)ని అంతర్జాతీయ ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించింది. పలువురు అంతర్జాతీయ వైద్య రంగ ప్రముఖులతో కూడిన నోవార్టిస్ గ్లోబల్ టీమ్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు, తలసీమియా, సికిల్ సెల్ అనీమియా రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకుంది. ఈ సందర్భంగా నవజాత శిశువులకు వ్యాధి పరీక్షల్లో సహకరించే అవకాశం పై, రోగులలో అనారోగ్య తీవ్రత మరణాలను తగ్గించడానికి పెరగాల్సిన అవగాహన గురించి కూడా చర్చించారు. ప్రతినిధి బృందంలో స్విట్జర్లాండ్‌కు చెందిన గ్లోబల్ మెడికల్ ఆపరేషన్స్, గవర్నెన్స్ డైరెక్టర్ డాక్టర్ తంజా రౌచ్, సీనియర్ క్లినికల్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ బరున్ రాయ్, లీడ్ క్లినికల్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ షర్మిలా తొడం ఉన్నారు. సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ బృందానికి స్వాగతం పలికారు.